# మారిన మనిషి

రాత్రి పదిగంటలైంది. రైలు నాంపల్లి స్టేషన్‌లో ఆగేసరికి జోరుగా వానకురుస్తోంది. ఈదురుగాలి, ఎల్లాగో రైలుదిగి, సామాను దింపించుకుని బెదురుతూ అటూ, ఇటూ కలయచూశాను, మావాళ్లెవరైనా వచ్చారేమోనని. ఎవరూ రాలేదు. మూడురోజుల క్రిందటే ఉత్తరం రాశాను, ఫలాన రైలుకు వస్తున్నాను, స్టేషనుకి రమ్మని. ఉత్తరం అందలేదేమో, ఎవరూ రాలేదు.

ఆ ఊళ్ళో మా మేనమామ ఉంటున్నాడు. ఏదా గేండ్లుగా రమ్మని రాస్తుంటే అనుకోకుండా ఇప్పుడు బయలుదేరాను. తగినట్టుగానే రైలు లేటు. జోరువాన, కొత్తఊరు. స్టేషనుకు ఎవరూరాలేదు. ఏమీ తోచక బెంగగా సామాను పట్టించుకుని బయటికి నడిచాను. అడ్రసు కాగితం భద్రంగా పర్సులో వుందిగాని, ఆపేట ఎక్కడో ఏమిటో, ఎలా వెళ్ళాలో నాకేమీ తెలియదు. బెంగగా, ఇంకా ఎవరైనా వస్తారేమో ననే ఆశతో, దిక్కులు చూస్తూ నిల్చున్నాను. రైలు దిగి వచ్చిన వాళ్ళందరూ ఒక్కొక్కరే ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోయారు. ఎవరూ లేరు. రిక్షాలు కూడా అన్నీ వెళ్ళిపోయాయి. ఒక్కటే మిగిలింది. నేను ఇంకా తటపటాయిస్తూంటే, ఆ రిక్షావాడే దగ్గరగా వచ్చి పలకరించాడు. "రిక్షా కావాలాండి? వానలో తడిసిపోతున్నారు రండి. ఎక్కండి?" అన్నాడు. ఈ చీకట్లో, ఈ వానలో వీడిని నమ్మి, ఒంటరిగా

రిక్షాలో పోవడమా ? వీడు తాగి లేడుగదా! అయినా అంత కన్నా చేసేది కనబడలేదు. భయంతో, అడ్రసు జ్ఞాపకం వున్నంతవరకూ చెప్పి "నీకు త్రోవ తెలుసా? ఎంత దూరం వుంటుందీ? జాగ్రత్తగా తీసుకు వెడతావా" అని అడిగాను. వాడు రెండు మూడు మైళ్ళుంటుందని, తను సరిగా తీసుకు వెళ్ళగలనని చెప్పాడు. పన్నెండణాలకు బేరం మాట్లాడుకుని దేవుడిమీద భారంవేసి ఎక్కి కూర్చున్నాను.

సామాను రిక్షాలో పెడుతుండగా వాడు నన్ను చూసి నవ్వుతూ అన్నాడు. "మీకేం భయంలేదండీ, నేను జాగ్రత్తగా తీసుకువెడతానుగా?" అని మళ్ళా కాస్త నవ్వుతూ అన్నాడు. "అమ్మగారు నన్ను గుర్తించలేదు" అని. "ఈ రాత్రివేళ వీడెవడూ వీడిని నేను గుర్తించడమేమిటి" అని నేను మరికాస్త గాభరాపడ్డాను. వానపడకుండా రిక్షాకు పట్టా కడుతూ వాడు మళ్ళా అన్నాడు: "నేను నారాయణని' అమ్మగారూ బెజవాడలో మీదగ్గర పనిచేశానుగా" అని.

నాకు వెంటనే గుర్తుకురాలేదు. నారాయణ అన్న పేరు ఎక్కడో విన్నట్టు లీలగా మనస్సుకు తోచింది. ఆలోచించగా కాస్సేపటికి గుర్తువచ్చింది. రాగానే గుండెల్లో రాయిపడింది. ఖర్మ! ఈ రాత్రివేళ ఈ యీదురుగాలి, వానలో, వీడి రిక్షాలోఎక్కి కూర్చున్నాను. వీడు నామీద కోపంకొద్దీ ఈ రిక్షాను ఏగుంటలోకో తోసెయ్యడుగదా! ఏమో! ఎప్పటికేది రాసిపెట్టివున్నదో అనుకుంటూ ముఖంమీద కారుతున్న వాననీరు తుడుచుకుంటూ కూర్చున్నాను. మసక

మసకగావున్న వీధిదీపాలు తప్పించుకుంటూ సందులుగొందులు తిరిగి రిక్షా ముందుకు సాగింది.

* * *

పన్నెండేళ్ళక్రిందటి మాట. అప్పుడు ఆయన బెజవాడలో ఉద్యోగంలో ఉన్నారు. కొత్తగా బదిలీఅయి వచ్చాం. అంతకుముందు వేసవిలో అక్కడ ఒక దొరగారు వుండేవారు. ఆ బెజవాడ ఎండలకు తట్టుకోలేక ఆయన మూడు నెలలైనా కాకముందే బెంగుళూరు బ్రాంచికి మార్పించుకున్నారు. అంచేత, రాజమండ్రిలో స్థిరంగా, సుఖంగావున్న మమ్మల్ని కొన్నాళ్ళపాటు బెజవాడ వెళ్ళమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పుట్టిపెరిగి ఎండలకూ, దోమలకూ, మురికికాలువలకూ అలవాటుపడిన మాకు ఏఊరైనా ఫరవాలేదు. మేము సంతోషంగానే వెళ్లాము. అయినా అక్కడ మేము ఇబ్బందిపడ్డదీ ఏమీలేదు కంపెనీవాళ్ళు మాకు ఊరిబయట ఆఫీసుకు దగ్గరగా మంచి ఇల్లు ఇచ్చారు. మాకు ఇంట్లో పనిచేయడానికి ఒక నౌకరునుకూడా ఇచ్చారు. వాడే నారాయణ.

ఇల్లు శుభ్రంగా అన్నివసతులతో సౌకర్యంగా వుండేది. ఊరికి దూరంగా ఉండడంచేత దోమలబాధ, మురికి నీటి బాధ, రెండూ తక్కువే. ఆయనకు ఆఫీసూ దగ్గరే! నడిచి పోవచ్చును. అన్నీ బాగానేవున్నాయి; కాని, నాకు వచ్చిన పేచీఅల్లా నారాయణతోనే. వాడికీ నాకూ మొదటి రోజునుంచే కుదరలేదు. ఇంట్లో పనికని ప్రత్యేకంగా నియమించారు కాబట్టి, వాడిచేత అన్నిపనులు చేయించుకునే

అధికారం నాకున్నదని నేననుకున్నాను. అది కాదని వాడను కున్నాడు; అంతే, మాకు కుదరలేదు. ఊరికి దూరంగా వుండడంచేత, వాడి కర్మ వాడిదని ఊరుకుని ఇంకో మనిషిని పెట్టుకోడానికి నాకు వీలుపడలేదు. అంతదూరం ఎవరూ రారు. పనిచేస్తే వాడు చెయ్యాలి, లేకపోతే నేను చేసుకోవాలి, ఇల్లాగ యిద్దరికి తప్పలేదు.

నారాయణ చాలా మొరటు మనిషి. దానికి తగ్గట్టు మొండితనం, దురభిమానం, దురహంకారం అన్నీ వున్నాయి. వాడు ఇంట్లో నౌకరుగా కాక, ఏదో ఉద్యోగస్తునిగా తన్ను భావించుకున్నాడు. దానికి తగినట్లే, అంతకుముందు వుండి పోయిన దొరగారికి సంసారం ఏమీ లేదుకూడా. బట్లరును తెచ్చుకున్నాడు వాడే గిన్నెలు తోమడందగ్గరనుంచి బట్టలు ఇస్త్రీ చేయడంవరకూ అన్నిపనులు చేసేవాడు. వంటా వార్పూ అంతా వాడిదే. ఆ దొరగారు ఉన్నన్నాళ్ళు నారా యణ పని సుఖంగావున్నది. ఆఫీసుకు వెళ్లేటప్పుడూ వచ్చే టప్పుడూ దొరగారి వెనకాలే కాగితాల కట్టలు తీసుకువెళ్ళ డమూ మిగతా టైములో వీధిగుమ్మందగ్గర కూర్చోవడమూ— అంతే పని. అదేదో గొప్ప హోదాగా వాడు భావించాడు.

ఆ ఊరికి వచ్చినరోజు, బండి దిగుతూవుండగానే నన్నుచూచి వాడు ముఖం చిట్లించుకున్నాడు. దొరగారి దగ్గర పనిచేసినవాడికి నాటురకం యజమాని, యజమాను రాలూ రావడం నచ్చలేదు కాబోలు వీడెవడో, ముఖం చిట్లించుకుంటాడు అనుకొని, ఎవరో తెలియక నేనూ ఊరు కున్నాను. మేము సామానుదింపి, వరండాలో సర్దుతూవుంటే,

వాడు చూస్తూ వూరుకున్నాడు. తరువాత అడిగితే చెప్పాడు, తాను ఈ బంగళా కనిపెట్టుకువుండే నౌకర్నని, కొత్తగా చేరానని. నాకు చిరాకేసింది. "అలా నుంచుంటావేం? ఆ సామానంతా తీసి లోపలపెట్టు" అని అదమాయించాను. వాడు వినపడనట్లు ఊరుకున్నాడు. నేను లోపలికివెళ్ళి ఇల్లు నాలుగుమూలలా చూసుకుని కొన్నిసామాన్లు సర్దుకున్నాను. వంటఇల్లు బాగుచేసుకుని, పొయ్యి అంటించాను. అప్పటికి ఆయనచేత యింకొకసారి చెప్పించుకుని వాడు, విధిలేక సామాన్లు కొన్ని విప్పి సర్దాడు.

మర్నాటినుంచీ మా ఇద్దరి మధ్యా యుద్ధం ప్రారంభమైంది. మొదట్లో కొద్దికొద్దిగా సాగి చివరకు పెద్దదైంది. ఇద్దరి మనస్సులకూ నిష్కారణంగా బాధ కలిగింది. ఆయన ఇంట్లో ఎప్పుడూ ఉండరు. పొద్దున ఏడుగంటలకు వెడితే సాయంత్రం ఏడు గంటలకు వస్తారు. మధ్యలో ఓగంట భోజనానికిమాత్రం వచ్చి వెడతారు. అంచేత ఇంట్లో ఏం జరుగుతున్నదీ ఆయనకు సామాన్యంగా తెలియదు. ఎప్పుడోగాని నేను చెప్పను. ఆయనకు కోపం ఎక్కువ. తొందర ఎక్కువ; ముందాలోచన ఉండదు. నారాయణను గురించి ఏ క్షణంలో నేను ఆయనతో చెపితే, మరుక్షణంలో వాడి ఉద్యోగం ఊడిపోతుంది. అది నాకు తెలుసు. అందుకనే చాలారోజులు నారాయణ ఎంత మొరటుగా ప్రవర్తించినా నేను ఆయనకు చెప్పలేదు.

రెండవ రోజు ఉదయమే ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయారు. చాలాసేపు నారాయణ గిన్నెలు తోమి, గదులు

ఊడుస్తాడని ఎదురు చూస్తూ నేను కూర్చున్నాను. వాకిట్లో చింతచెట్టు క్రింద చాప పరుచుకుని దిక్కులు చూస్తూ, వాడు కూర్చున్నాడు. చివరకు పిలిచి చెప్పాను, ఈ పని చెయ్యాలని. వాడు ముఖం మాడ్చుకున్నాడు. మాట్లాడ లేదు. పని చెయ్యలేదు. మళ్ళీ ఒకసారి పిలిచి గట్టిగా చెప్పాను. ఈసారి ధైర్యం తెచ్చుకుని తన అభిప్రాయం చెప్పాడు: "మేముబాగా బతికిన వాళ్ళమండీ! ఇలాంటి పనులు చెయ్యం" అన్నాడు. నేను తెల్లపోయాను. వాడితో వాదించలేక ఆ పూటకి నేనే చేసుకున్నాను. క్రమంగా, తెలుసుకున్నాను. వాడు ఇష్టంగా బుద్ధిపూర్వకంగా చేసే పని ఒక్కటిలేదని. వాడు మంచి కుటుంబంలో పుట్టాడు. వాడి తండ్రి తాతలు ఒకప్పుడు మడిమాన్యాలున్న వాళ్ళే. ఇప్పుడు చితికిపొయ్యారు. అందుకని వాడు నౌకరీకి, విధిలేక వచ్చాడు. కాని, అంతస్తుకు తగని పనిమాత్రం వాడు ఆరునూరైనా చెయ్యడు. ఇది వాడి నిశ్చితాభిప్రాయం.

కాని, వాడి అంతస్తు ఏమిటో దానికి తగ్గపనేదో వాడికే తెలియదు. నాకూ తెలియదు. నౌకర్ని ఎదురుగుండా వుంచుకుని, వాడికి కూడా వండిపెడుతూ రోజూ అంతపనీ నేనే చేసుకోవడం నా సహనానికి మించినదైంది. మొదట్లో నెమ్మదిగా చెప్పాను. ఒకనౌకరీ ఒప్పుకుని వచ్చాక దానిలో సాధక బాదకాలను ఓర్పుతో పని చక్కగా చెయ్యాలని వాడి తలకెక్కలేదు.

ఓ రోజు వాడితో మంచిగా మాట్లాడి, వాడి కుటుంబ విషయాలు కనుక్కున్నాను. వాడిది ఈ ఊరుకాదు. ఎక్కడో

నెల్లూరు దగ్గర. ఊళ్లో, వాడికి పెళ్ళాం ఒక ఆడపిల్ల మాత్రం ఉన్నారు. ఇంకెవరూ లేరు. ఆ ఊళ్లో వాడికి తిండికి జరగలేదు. సంపాదించడం లేదని భార్య రోజూ సాధించేది. ఆ పోరు పడలేక ఓ రోజు చెప్పకుండా పారిపోయి, ఈ ఊరు వచ్చాడు, ఇక్కడ, అక్కడక్కడా తిరగ్గా చివరకు ఈ నౌకరీ దొరికింది. వాడు ఈ ఊరువచ్చి ఆరునెలలైంది. వచ్చినప్పటినుంచీ ఇంటికి ఉత్తరం రాయలేదు. భార్యమీద కోపం. బాగా సంపాదించిన తరువాతగాని ఇంటికి పోగూడదు. ఉత్తరం రాయకూడదు అని మొండి పట్టుదల. ప్రతి నెలా జీతం జాగ్రత్తగా దాచేవాడు. ఉండి, ఉండి పిల్లని తలుచుకుని దిగులుపడేవాడు ·కాని ఉత్తరం మాత్రం రాసేవాడు కాదు.

నాకు వాడినిచూసి జాలేసింది. వాడి మొండితనం మాత్రం నచ్చలేదు. "బాగా సంపాదించాలని పట్టుదలకల వాడికి ఈ మొరటుతనం పనికిరాదు. ఆపనిచెయ్యనూ, ఇది చెయ్యనూ, అన్న దురభిమానం పనికిరాదు" అని నెమ్మదిగా బోధించి చెప్పాను. వాడి చెవికెక్కలేదు. "ఇల్లు ఊడవడం, గిన్నెలు తోమడం యిల్లాంటి పనులుమాత్రం నేను చచ్చినా చెయ్యనండీ! ఉద్యోగం పోయినాసరే, మా ఊరి వాళ్ళెవరైనా చూస్తే నవ్వుతారు" అన్నాడు, మొండిగా. నాకు కోపం ఆగలేదు "ఏమిటీ పిచ్చి అభిమానం! నువ్వు చెయ్యకపోతే ఆఫీసరుగారి భార్యను నేను చెయ్యవచ్చునా?" అన్నాను వ్యంగ్యంగా తరువాత గట్టిగా కేకలువేశాను.

వాడు మొహం మాడ్చుకొన్నాడు. రెండురోజులు భోజనం మానేశాడు. నేను ఆయనతో చెప్పి, ఉద్యోగం

లోనుంచి తీసివేయిస్తానేమో అనుకున్నాడు. భయపడి దిగులుపడ్డాడు. పనిమాత్రం చెయ్యలేదు. వాడిపోయిన వాడి ముఖం చూస్తే నాకు జాలేసింది. వాడి పట్టుదలచూస్తే విసుగొచ్చింది.

ఆ తరువాత వాడిష్టపడి చేసిన పనులే చేయించుకుంటూ కొన్నాళ్లు ఓపికతో గడిపాను. ఓరోజు మధ్యాహ్నం పెట్టెలు సర్దుతూవుంటే, అడుగున కొన్నతరువాత ఒక్కసారైనా వాడని ఇస్త్రీపెట్టె కనిపించింది. అది చూడగానే, నారాయణకు ఈపని నేర్పితే ఇదైనా చేస్తాడేమోననిపించింది. ఉత్సాహంతో అది బయటికితీసి వాడిని పిలిచి బట్టలు ఇస్త్రీ చెయ్యమని చెప్పాను. వాడు ఆపెట్టెను తను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదనీ తనకు చేతకాదనీ అన్నాడు. నేను ఉత్సాహంగా "ఏం ఫరవాలేదు, నేను నేర్పుతాలే; చెయ్యి" అన్నాను. వాడు మొండిగా "నాకు చాతకాదు నేను చెయ్యను" అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. కోపం ఆగలేదు "ఇంత పొగరుమోతుతనం పనికిరాదు. ఇవ్వాల్టితో [illegible]

[illegible]

కున్నాను. ఏమీలేదు. వెళ్ళిపోతావంటే పెళ్ళాం పిల్లను తలచుకుని నాకే జాలేసింది. కాని, వాడి మొండితనంచూసి ఏమీ అనడానికి బుద్ధిపుట్టలేదు.

ఆ వేళే వాడికో ఉత్తరం వచ్చింది. అది ఇచ్చాను. వాడు మళ్లా నాకే ఇచ్చి నన్నే చదవమన్నాడు. అది వాడి పెళ్లాం రాసింది.

"నీవు నాతో కొట్లాడి పిల్లదాని చేతి బంగారుగాజు లాక్కొని చెప్పకుండా పోయి ఆరునెలలైంది. ఇంతవరకూ జాబులేదు. నీవు పోయినాక పిల్లది శానాసేపు ఏడ్చింది. పసిదాని చేతిగాజు లాగడానికి నీ కెట్లా బుద్ధిపుట్టింది? మొన్న, సుబ్బయ్య బెజవాడలో నిన్ను చూశానని చెప్పి అడ్రసు ఇచ్చాడు. పిల్లది బెంగపడుతున్నది. సంపాదించకపోతే ఫరవాలేదు. ఉత్తరం చూచిన తక్షణం బయలుదేరి రావాలి."

అదే ఉత్తరం. చదివి తలెత్తి చూశాను. నారాయణ రెండు కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయి. నాకు చాలా బాధ అనిపించింది. కాని, వాడు అడగందే నేను ఉండమని అనలేకపోయాను. "మీ ఊరు వెళతావా ?" అన్నాను. "లేదమ్మగారు! నేను బాగా డబ్బు సంపాదించేవరకూ మా ఊరుపోను" అన్నాడు. మళ్ళా తనలో తాను గొణుక్కుంటు న్నట్లు కళ్ళుతుడుచుకుంటూ అన్నాడు "పిల్లదానిచేతి బంగారు గాజు మళ్ళా కొనేదాకాపోను" అని అంటూ వాడు వెళ్ళి పోయాడు. మళ్ళా కనబడలేదు.

ఆవేళంతా వాడిని గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. ఉద్యోగం పోగొట్టుకొని వాడేం బాధపడతాడో, తిండిలేక

వాడి పెళ్ళాం ఎంత బాధపడుతున్నదో అనుకున్నాను. వాడి అన్నం నేను తీసివేశానని బాధ కలికింది. నాది పొరపాటేమో ననిపించింది. వాడిని కేకలువేయడానికి, అవమానించడానికి నాకేమి అధికారం ఉన్నది. వాడి కిష్టంలేని పనే వాడిచేత చేయించాలని పట్టుబట్టడం నాదిమాత్రం దురభిమానం కాదా అనిపించింది మాటిమాటికి. ఎప్పుడో విన్న,

"అవజానన్తిమాం మూఢా మానుషీం
తనుమా శ్రితమ్"
అన్న గీతా వాక్యము,
"ఘట్ ఘట్ మే ఓ సాయి రమతా
కటుక్ పచన్ మత్ బోలు రే"

అన్న కబీర్ వచనము పదే పదే జ్ఞాపకంవచ్చి ఏదో తప్పుచేసి నట్లు బాధకలిగింది. వాడిని అవమానించటానికీ, శిక్షించడానికీ నాకు అధికారం ఉన్నదా ? రెండు రోజులు ఏదో మనసులో ముల్లు గుచ్చుకున్నట్లైంది. ఏమీ తోచలేదు.

పన్నెండేళ్ళ తరువాత, మళ్లా ఇవ్వాళ కనిపించాడు. అప్పుడు నౌకరీ తీసివేయించానన్న కోపంతో వీడు నామీద కసితీర్చుకోడుకదా !

ఆలోచన తెగకముందే వాడు ఒక ఇంటిముందు రిక్షా ఆపి నంబరు చెప్పమన్నాడు. తరువాత ఇదే యిల్లు దిగ మన్నాడు. నాకు ప్రాణం లేచివచ్చింది. వాడు ఎక్కడా పడవెయ్యకుండా సురక్షితంగా ఇల్లు చేర్చినందుకు సంతో షిస్తూ, దిగి డబ్బులివ్వబోయాను. వాడు చేయిజాపబోయి మళ్ళీ వెనక్కి లాక్కుని, "వద్దులెండమ్మగారూ ఫరవాలేదు"

అన్నాడు. నేను బలవంతంచేసి లాభంలేకపోయింది. ఇంతలో తలుపులు తెరచి మావాళ్ళు బయటికివచ్చారు. నారాయణ వెళ్ళబోతూవుంటే అడిగాను "నీపెళ్లాం పిల్ల బాగున్నారా?" అన్నా. వాడు నవ్వుతో: "ఇక్కడే వున్నారమ్మగారు. రేపు తీసుకొచ్చి చూపిస్తాను. ఇప్పుడు ముగ్గురు మగపిల్లకాయలు." అంటూ కొద్దిగా గర్వంతో నవ్వుతూ వెళ్ళిపోయాడు.

మర్నాడు మధ్యాహ్నం మాటప్రకారం భార్యనూ పిల్లల్నూ తీసుకువచ్చాడు. వాడి భార్య బలంగా ఆరోగ్యంగా ఉన్నది. ముగ్గురు మగపిల్లలు, చిన్నచిన్నవాళ్ళు. "అమ్మాయేదీ" అన్నాను. నారాయణ సిగ్గుపడుతూ చెప్పాడు: "పిల్లదానికి పెళ్ళిజేశానమ్మగారు. అత్తారింటికాడున్నది. "ఆవేళ పోవడం పోవడం ఈఊరు వచ్చానమ్మగారు. చాలా కష్టపడ్డాను. కొన్నాళ్లు రిక్షాలు లాగాను. ఇప్పుడు ఫరవాలేదమ్మగారు. రెండు మూడు రిక్షాలుకొని అద్దెకిస్తున్నాను. నిన్నరాత్రి ఊరికే సరదాకు రిక్షాతీసుకు స్టేషన్ కాడికొచ్చాను. తమరు కనిపించారు" అన్నాడు సవినయంగా. కొత్తగావచ్చిన ఆ వినయానికి నేను సంతోషించాను. "ఐతే డబ్బుసంపాదించాకే పెళ్లాన్ని చూస్తానన్న పట్టునెగ్గించుకున్నావన్నమాట!" అన్నాను నవ్వుతూ. వాడూ నవ్వాడు. వాళ్లు వెళ్ళబోతుంటే వాడి పెళ్ళానికొక రవికగుడ్డా, పిల్లలకు పళ్లూ ఇచ్చాను. అవి అందుకుని నారాయణ వినయంగా నమస్కారంచేసి వెళ్ళాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఏమీ లేనప్పుడు ఆ అహం భావం. అన్నీ వున్నప్పుడు ఈ అణకువ! మంచిదేననున్నాను.

ఎప్పుడో గుచ్చుకొన్న ముల్లు ఇవ్వాళ ఊడిపోయింది.